

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



నవంబర్ 4 బుధవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 269 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

WEDNESDAY NOVEMBER 4 2026 | VOL:18 | ISSUE: 269 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సీఎం కీలక ఆదేశాలు

మహారాష్ట్రతో నిరంతర సంప్రదింపులు జరపాలి

ముంపు భూముల పూర్తి వివరాలు సిద్ధం చేయండి

పరిహారం నిధులు జాయింట్ అకౌంట్‌లో ఉంచుతాం: సీఎం రేవంత్



హైదరాబాద్, నవంబరు 3: తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అంతర్రాష్ట్ర సమన్వయానికి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పురోగతి, మహారాష్ట్రతో సంప్రదింపులు, ముంపు భూములు, పరిహారం

(మిగతా 2వ పేజీలో..)

పేదల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం: పొంగులేటి

పేదల కష్టాలను పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం

రైతులకు బోనస్ ఇచ్చి అండగా నిలిచాం

ఇప్పటికే 74 వేల ఉద్యోగాల భర్తీ

8 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

ప్రతి గ్రామంలో భూసర్వేకు చర్యలు

ఖమ్మం జిల్లా, నవంబరు 3 :

గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర సంపద దుర్వినియోగమైందని, ప్రజల సంక్షేమాన్ని పక్కనపెట్టి స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. తొమ్మిదిన్నరేళ్ల పాటు తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కష్టాలను పట్టించుకోలేదని ఆరోపించారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం

ప్రతిపక్ష నేతలు తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరి సాగు చేసే రైతులను నిరుత్సాహపరిచారని, వరి వేస్తే ఉరే అన్న పరిస్థితిని సృష్టించారని విమర్శించారు. ఇందిరమ్మ ప్రభుత్వం మాత్రం రైతులు పండించిన పంటకు బోనస్ అందించి అండగా నిలిచిందని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజా ప్రభుత్వం వారి అభ్యున్నతికి కృషి చేస్తోందని



(మిగతా 2వ పేజీలో..)

ట్రంప్‌కు అగ్నిపరీక్ష.. అమెరికాలో మొదలైన మధ్యంతర ఎన్నికల పోలింగ్



అమెరికా రాజకీయ భవిష్యత్తును నిర్దేశించనున్న కీలకమైన మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (రిపబ్లికన్ పార్టీ) రెండేళ్ల పాలనకు ప్రజా తీర్పుగా భావిస్తున్న ఈ ఎన్నికల ప్రక్రియ మంగళవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) మొదలైంది. న్యూయార్క్, న్యూజెర్సీ, వర్జీనియా, కనెక్టికట్ సహా పలు తూర్పు తీర రాష్ట్రాల్లో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటలకు పోలింగ్ మొదలవగా, ఓటు వేసేందుకు ప్రజలు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు.ఈ ఎన్నికల్లో ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలతో పాటు, సెనెట్‌లోని 100 స్థానాలకు గాను 35 సీట్లకు పోలింగ్ జరుగుతోంది. వీటితో పాటు 36 రాష్ట్రాల గవర్నర్ పదవులకు కూడా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 21 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును

(మిగతా 2వ పేజీలో..)

భారతీయ విద్యార్థులకు బ్రిటన్ బంపరాఫర్.. అర్హత ఉంటే రెండేళ్ల గ్రాడ్యుయేట్ వీసా



బ్రిటన్‌లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే భారతీయ విద్యార్థులకు ఊరటనిచ్చే ప్రకటన వెలువడింది. ఎంపిక చేసిన అర్హత కలిగిన యూనివర్సిటీల్లో చదువు పూర్తి చేసిన అంతర్జాతీయ విద్యార్థులకు గ్రాడ్యుయేట్ వీసా గడువును రెండేళ్లకు పెంచనున్నట్లు యూకే ప్రభుత్వం ప్రకటించింది. యూనివర్సిటీల నిబంధనల పాటింపు రికార్డు మెరుగ్గా ఉండటంతో పాటు, అక్కడ చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఆశాజనకంగా ఉన్నాయనే ప్రమాణాల ఆధారంగా ఈ అర్హతను నిర్ణయించనున్నారు. ఈ వివరాలను యూకే ప్రభుత్వం బడ్జెట్ పత్రంలో వెల్లడించింది.2027 జనవరి 1 నుంచి బ్రిటన్‌లో బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీలు పూర్తి చేసిన సాధారణ అంతర్జాతీయ విద్యార్థులకు గ్రాడ్యుయేట్ వీసా గడువు రెండేళ్ల నుంచి 18 నెలలకు తగ్గనుంది. అయితే వలస

(మిగతా 2వ పేజీలో..)

అసెంబ్లీ విస్తరణకు భారీ ప్రణాళిక.. కొత్త భవనాలకు ప్రతిపాదనలు

కొత్త భవనాలు, పరిపాలనా కార్యాలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు

పార్కింగ్ సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి

పర్యాటక శాఖ, డీజీపీ కార్యాలయ భూముల బదిలీపై పరిశీలన

పచ్చదనానికి విఘాతం కలగకుండా అభివృద్ధి పనులు

హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, శాసన మండలి ప్రాంగణాలను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం శాసన మండలి ప్రాంగణాన్ని సందర్శించి, ప్రతిపాదిత అభివృద్ధి పనులను పరిశీలించారు. విస్తరణకు గుర్తించిన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాసనసభ, మండలి కార్యకలాపాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను పెంచడం, ప్రజాప్రతినిధులకు మెరుగైన వసతులు కల్పించడంపై ఈ సందర్భంగా చర్చించారు.

ప్రజాప్రతినిధుల కోసం కొత్త భవనాలు

శాసనసభ స్పీకర్, శాసన మండలి ఛైర్మన్‌తో పాటు కీలక ప్రజాప్రతినిధుల నివాస భవనాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభకు అనుబంధంగా పరిపాలనా భవనాలు, వివిధ రాజకీయ పక్షాల కార్యాలయాలు, విశ్రాంతి భవనం, క్రీడా మైదానం ఏర్పాటు చేసే అంశాలను కూడా పరిశీలించారు. శాసనసభ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు అవసరమైన అదనపు సదుపాయాల కల్పనపై సమీక్షించారు.

పార్కింగ్, ప్రాంగణ విస్తరణపై దృష్టి

శాసనసభకు వచ్చే వాహనాల సంఖ్య పెరుగుతున్న

(మిగతా 2వ పేజీలో..)

కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!: జగన్

- **మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన వైసీపీ అధినేత జగన్**
- **చంద్రబాబు, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్ అంటూ వ్యంగ్యం**
- **ఇవి ఎన్నికలు కాదని, ఏకపక్షంగా జరిగిన సెలక్షన్లని ఆరోపణ**
- **నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు ప్రక్రియను హైజాక్ చేశారని విమర్శ**
- **ఎన్నికల సంస్కరణల ఆవశ్యకత స్పష్టమైందని వ్యాఖ్య**

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కూటమి ప్రభంజనం సృష్టిస్తున్న వేళ, వైసీపీ అధినేత జగన్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా

(మిగతా 2వ పేజీలో..)

ఆర్టీజీఎస్, టెక్నాలజీతో తుపానుల గండం గట్టెక్కాం: సీఎం చంద్రబాబు

అర్నబ్, మురసు తుఫాన్లపై ఆర్టీజీఎస్‌లో సీఎం మీడియా సమావేశం

ప్రాణ నష్టం నివారించి, ఆస్తి నష్టం తగ్గించగలిగామన్న చంద్రబాబు

టెక్నాలజీ సాయంతో 90 శాతం కచ్చితత్వంతో అంచనాలు

రికార్డు సమయంలో విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ

సహాయక చర్యల్లో సిబ్బంది ప్రాణాలకు తెగించి పనిచేశారని కితాబు



రాష్ట్రంపై వరుసగా విరుచుకుపడిన అర్నబ్, మురసు తుపానులను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, టెక్నాలజీని వాడుకుంటూ పక్కా ప్రణాళికతో పనిచేయడం వల్లే ప్రాణనష్టాన్ని నివారించగలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలోని ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తుఫాన్ సహాయక చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం స్పందించిన తీరును

(మిగతా 2వ పేజీలో..)

భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంది: ఏపీఎస్డీఎంఏ అలర్ట్

దక్షిణ కోస్తాంధ్రపై మురసు తీవ్ర తుపాను ప్రభావం

రానున్న 3 గంటల్లో పలు జిల్లాలకు కుండపోత వర్ష సూచన

ఆకస్మిక వరదలపై లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరిక

పొంగిపొర్లే వాగులు దాటవద్దని అధికారుల విజ్ఞప్తి

క్రమంగా బలహీనపడనున్న తుపాను, రాత్రికి తగ్గునున్న గాలులు



దక్షిణ కోస్తాంధ్రపై ప్రభావం చూపుతున్న 'మురసు' తీవ్ర తుపాను కారణంగా రానున్న మూడు గంటల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసి, ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ

(మిగతా 2వ పేజీలో..)

విజయకేరటం
తెలుగు దినపత్రిక

02 జనరల్ న్యూస్

సం పా ద కీయం

విపత్తుల వేళ అప్రమత్తత.. ప్రాణరక్షణకు ముందస్తు సన్నద్ధత!

ప్రకృతి వైపరీత్యాలు ఎప్పుడు, ఎక్కడ సంభవిస్తాయో కచ్చితంగా చెప్పడం సాధ్యం కాకపోయినా.. వాటిని ఎదుర్కొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవడం మన చేతుల్లోనే ఉంది. భారీ వర్షాలు, వరదలు, తుపానులు, పిడుగులు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు వంటి విపత్తులు ఒక్కసారిగా ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తాయి. ఆస్తి నష్టంతో పాటు ప్రాణనష్టం కూడా సంభవిస్తుంది. విపత్తు వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ప్రమాదాన్ని గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడం అత్యంత ముఖ్యం.విపత్తులు పూర్తిగా మన నియంత్రణలో ఉండకపోవచ్చు. కానీ వాటి ప్రభావాన్ని తగ్గించుకోవడం సాధ్యమే. ముందస్తు హెచ్చరికలు, ప్రజలకు సరైన సమాచారం, అత్యవసర సేవల సమన్వయం, సురక్షిత ప్రాంతాల గుర్తింపు, సహాయక సామగ్రి సిద్ధం చేసుకోవడం వంటి చర్యలు ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలవు.

హెచ్చరికలను నిర్లక్ష్యం చేయకూడదు

వాతావరణ శాఖలు, విపత్తుల నిర్వహణ సంస్థలు జారీ చేసే హెచ్చరికలను ప్రజలు తేలికగా తీసుకోకూడదు. భారీ వర్షాలు, తుపానులు, వరదలపై ముందస్తు సమాచారం వచ్చినప్పుడు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ముందుగానే ఏర్పాట్లు చేయాలి.వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లే సమయంలో వాటిని దాటేందుకు ప్రయత్నించడం ప్రమాదకరం. వరద నీటిలో వాహనాలతో ప్రయాణించడం, విద్యుత్ స్తంభాలు లేదా తెగిపడిన తీగల సమీపంలోకి వెళ్లడం ప్రాణాపాయానికి దారితీయవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి.అత్యవసర వ్యవస్థలు బలోపేతం కావాలివిపత్తుల సమయంలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కీలకం. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్య, విద్యుత్, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు సమష్టిగా పనిచేయాలి. ప్రతి జిల్లాలో ప్రమాదకర ప్రాంతాలను ముందుగానే గుర్తించి కార్యాచరణ రూపొందించాలి.అత్యవసర సమయంలో వినియోగించేందుకు అంబులెన్సులు, రక్షణ పరికరాలు, తాగునీరు, ఆహారం, మందులు, తాత్కాలిక ఆశ్రయ కేంద్రాలు సిద్ధంగా ఉండాలి. విపత్తు సంభవించినప్పుడు సమాచారం అందించేందుకు ప్రత్యేక నియంత్రణ కేంద్రాలు సమర్థంగా పనిచేయాలి. సహాయక చర్యల్లో జాప్యం జరగకుండా బాధ్యతలను ముందుగానే కేటాయించాలి.

పట్టణ ప్రణాళికలో ప్రమాదాల అంచనా అవసరం

పట్టణాల్లో వేగంగా పెరుగుతున్న నిర్మాణాలు, నాలాల ఆక్రమణలు, చెరువుల పూడిక, నీటి ప్రవాహ మార్గాల మూసివేత వంటి అంశాలు భారీ వర్షాల సమయంలో సమస్యలను తీవ్రతరం చేస్తున్నాయి. సహజ నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడితే చిన్నపాటి వర్షానికే కొన్ని ప్రాంతాలు నీటమునిగే పరిస్థితి ఏర్పడుతుంది.కొత్త నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు భౌగోళిక పరిస్థితులు, నీటి ప్రవాహ మార్గాలు, డ్రైనేజీ సామర్థ్యం, పర్యావరణ ప్రభావాలను పరిశీలించాలి. ఇప్పటికే ఉన్న ఆక్రమణలు, ప్రమాదకర నిర్మాణాలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలి. పట్టణాభివృద్ధి అనేది కేవలం భవనాలు, రహదారుల నిర్మాణం మాత్రమే కాదు.. ప్రజల భద్రతకు అనుకూలమైన మౌలిక సదుపాయాలను కల్పించడం కూడా.

గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

గ్రామీణ ప్రాంతాల్లో వరదలు, వర్షాభావం, పిడుగులు, అగ్నిప్రమాదాల వల్ల రైతులు, పశు పోషకులు, కూలీలు ఎక్కువగా నష్టపోయే అవకాశం ఉంటుంది. పంటలు, పశువులు, వ్యవసాయ పరికరాలను రక్షించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలి. వాగులు, వంకల సమీపంలో నివసించే కుటుంబాలకు ప్రమాద సూచనలు తెలియజేయాలి.గ్రామపంచాయతీ స్థాయిలో అత్యవసర సహాయక బృందాలను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ప్రాథమిక రక్షణ, ప్రథమ చికిత్సపై శిక్షణ ఇవ్వాలి. విపత్తుల సమయంలో గ్రామస్థులకు తక్షణ సమాచారం అందేలా వ్యవస్థ ఉండాలి.

ప్రజల భాగస్వామ్యమే నిజమైన రక్షణ

విపత్తుల నిర్వహణ అనేది కేవలం ప్రభుత్వ యంత్రాంగానికి సంబంధించిన పని కాదు. ప్రతి పౌరుడికి ఇందులో బాధ్యత ఉంది. ప్రమాద సూచనలను గమనించడం, అధికారులకు సమాచారం ఇవ్వడం, అత్యవసర నిబంధనలు పాటించడం, బాధితులకు సహాయం చేయడం వంటి చర్యల ద్వారా ప్రజలు కీలక పాత్ర పోషించవచ్చు.విపత్తు వచ్చినప్పుడు ధైర్యం అవసరం.. కానీ అంతకంటే ముందుగా అప్రమత్తత అవసరం. ముందస్తు ప్రణాళికలు, సమర్థమైన అధికార యంత్రాంగం, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల భాగస్వామ్యం కలిసినప్పుడే ప్రాణనష్టాన్ని తగ్గించగలం. విపత్తుల కోసం ఎదురుచూసి స్పందించడం కాదు.. అవి సంభవించే ముందే సిద్ధంగా ఉండాలి. ఆస్తులను తిరిగి సంపాదించుకోవచ్చు.. కానీ కోల్పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురాలేం. అందుకే ప్రతి విపత్తు నుంచి పాఠాలు నేర్చుకుని మరింత సురక్షితమైన సమాజ నిర్మాణానికి అడుగులు వేయాలి.

కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!: జగన్

మొదటి పేజీ తరువాయి)

స్పందించారు. ఎన్నికల ప్రక్రియ ఏకపక్షంగా జరిగిందని ఆరోపిస్తూ, ఇవి ఎలక్షన్లు కావని, సెలెక్షన్లు అని ఆయన వ్యంగ్యం ప్రదర్శించారు.చంద్రబాబు, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి జగన్ వ్యంగ్యంగా అభినందనలు తెలిపారు. "ప్రతిపక్షానికి పోటీ చేసే అవకాశమే ఇవ్వకుండా ఎన్నికల్లో అద్భుతంగా ఎలా గెలవచ్చో నిరూపించినందుకు చంద్రబాబు టీమ్, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్!" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.నామినేషన్ల దగ్గరి నుంచి మొదలుకొని స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ ఏజెంట్ల నియామకం, పోలింగ్ సరళి, పోలింగ్ శాతం, చివరకు కౌంటింగ్ వరకు ప్రతీ దశను అధికార పక్షం హైజాక్ చేసిందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోలేదని, అధికార పార్టీయే వారిని సెలెక్ట్ చేసిందని ఎద్దేవా చేశారు.ఈ పరిణామాల నేపథ్యంలో దేశంలో ఎన్నికల సంస్కరణలు ఎంత అవసరమో స్పష్టమవుతోందని జగన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయం దిశగా దూసుకెళుతుండగా, వైసీపీ అనేకచోట్ల పరాజయం పాలవుతున్న నేపథ్యంలో జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంది: ఏపీఎస్డీఎంఏ అలర్ట్

(ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది.ప్రస్తుతం 'మురసు' తీవ్ర తుపాను గడిచిన 6 గంటల్లో గంటకు 6 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ఇది బాపట్లకు 40 కి.మీ, ఒంగోలుకు 50 కి.మీ, విజయవాడకు 90 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో పోలవరం, కాకినాడ, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే, మన్యం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరుతో పాటు నెల్లూరు, కడప, నంద్యాల జిల్లాల్లోనూ అక్కడక్కడా మోస్తరు వర్షాలు పడతాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ కీలక సూచనలు జారీ చేశారు. "భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉంది. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని దాటే ప్రయత్నం చేయవద్దు. ఆకస్మిక వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి" అని ఆయన స్పష్టం చేశారు. అయితే, 'మురసు' తుపాను క్రమంగా బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ రోజు రాత్రి నుంచి ఈదురుగాలుల తీవ్రత కూడా తగ్గుముఖం పడుతుందని అంచనా వేశారు. అయినప్పటికీ, అధికార యంత్రాంగం నుంచి హెచ్చరికలు తొలగించే వరకు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సీఎం కీలక ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి)

చెల్లింపులపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మహారాష్ట్రతో చర్చలు కొనసాగించాలి

తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సీఎం సూచించారు. గతంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలు, ప్రాజెక్టుకు సంబంధించిన కీలక పత్రాలన్నింటినీ మహారాష్ట్ర అధికారులకు అందజేయాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టు విషయంలో ఎలాంటి సందిగ్ధత లేకుండా పరస్పర సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు.

ముంపు భూముల వివరాలు సిద్ధం చేయాలి

బ్యారేజ్ నిర్మాణం కారణంగా మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాలపై మహారాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సర్వే నిర్వహించినా అభ్యంతరం లేదని సీఎం తెలిపారు. సర్వే ప్రక్రియకు అవసరమైన సహకారం అందించాలని, భూములకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అక్కడి అధికారులకు అందించాలని సూచించారు.

పరిహారం నిధులు జాయింట్ అకౌంట్‌లో

ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పరిహారం చెల్లింపుల కోసం అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. భూముల సర్వే, పరిహారం చెల్లింపుల విషయంలో స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు.

అంతర్రాష్ట్ర సమన్వయంతో ప్రాజెక్టు ముందుకు

తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సమస్యలను మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సీఎం ఆదేశించారు. రెండు రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని కొనసాగిస్తూ ప్రాజెక్టు పురోగతికి అవసరమైన చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. తాజా సమీక్షతో ముంపు భూముల సర్వే, పరిహారం చెల్లింపులు, మహారాష్ట్రతో సంప్రదింపుల అంశాలు ప్రాజెక్టులో కీలకంగా మారాయి.

పేదల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం: పొంగులేటి

మొదటి పేజీ తరువాయి)

వివరించారు.

మరిన్ని ఉద్యోగాల భర్తీకి హామీ

నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే 74 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని పొంగులేటి తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలను కల్పిస్తామని భరోసా ఇచ్చారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

రాష్ట్రంలో అర్హులైన పేదలకు 8 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లను అందించామని మంత్రి వెల్లడించారు. సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

భూముల సర్వేతో రైతులకు భరోసా

రాష్ట్రంలో సుమారు 120 ఏళ్ల క్రితం భూముల సర్వేలు జరిగాయని పొంగులేటి పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రతి గ్రామంలో భూముల సమగ్ర సర్వే చేపట్టి, భూమి యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో భూసర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. మ్యాపులతో కూడిన భూసర్వే వివరాలను ప్రతి భూయజమానికి అందించి, ఆధార్ తరహాలో భూదార్ గుర్తింపును కల్పిస్తామని స్పష్టం చేశారు.

అసెంబ్లీ విస్తరణకు భారీ ప్రణాళిక.. కొత్త భవనాలకు ప్రతిపాదనలు

మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో పార్కింగ్ సదుపాయాలను విస్తరించి, రద్దీని తగ్గించేలా చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. ప్రాంగణ విస్తరణకు అవసరమైన అదనపు స్థలాల లభ్యతపైనా అధికారులు చర్చించారు. ఇందులో భాగంగా పర్యాటక శాఖకు చెందిన భూమితో పాటు డీజీపీ కార్యాలయానికి సంబంధించిన కొంత భూమిని శాసనసభ అవసరాల కోసం బదిలీ చేసే అవకాశాలను పరిశీలించారు. ఆయా భూముల లభ్యత, వినియోగ సాధ్యాసాధ్యాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

పచ్చదనాన్ని కాపాడుతూ అభివృద్ధి

శాసనసభ ప్రాంగణాన్ని ఆధునికంగా తీర్చిదిద్దే క్రమంలో ఇప్పటికే ఉన్న పచ్చదనానికి ఎలాంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భవనాల నిర్మాణంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సుస్థిర అభివృద్ధి ప్రమాణాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని స్పష్టం చేశారు. దీంతో ప్రాంగణంలో పచ్చదనాన్ని కాపాడుతూనే ఆధునిక మౌలిక సదుపాయాలు, రవాణా, పార్కింగ్ వ్యవస్థలను సమన్వయం చేసేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ మాస్టర్ ప్లాన్ అమలైతే శాసనసభ, శాసన మండలి ప్రాంగణాలకు కొత్త రూపురేఖలు రానున్నాయి.

భారతీయ విద్యార్థులకు బ్రిటన్ బంపరాఫర్.. అర్హత ఉంటే రెండేళ్ల గ్రాడ్యుయేట్ వీసా

మొదటి పేజీ తరువాయి)

నిబంధనలను పక్కాగా పాటించే, తమ విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించే యూనివర్సిటీల్లో చదువు పూర్తి చేసినవారికి మాత్రం రెండేళ్ల వీసా ఇవ్వాలని బ్రిటన్ ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. దీంతో యూనివర్సిటీ అర్హతను బట్టి చదువు తర్వాత బ్రిటన్‌లో ఉండే గడువు మారనుంది.చదువు పూర్తయిన తర్వాత బ్రిటన్‌లోనే ఉండి ఉద్యోగ అనుభవం సంపాదించాలనుకునే భారతీయ విద్యార్థులకు ఈ నిర్ణయం ఉపయోగపడనుంది. అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించడంలో చదువు తర్వాత పని చేసే అవకాశం కీలకంగా మారిందని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇకపై యూనివర్సిటీ ఎంపికలో ర్యాంకింగ్స్‌తో పాటు ఆ సంస్థ నిబంధనల పాటింపు, విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించడంలో దాని పనితీరును కూడా పరిశీలించాల్సి ఉంటుందని సూచిస్తున్నారు. మరోవైపు, ప్రపంచంలోని టాప్ 150 యూనివర్సిటీల్లో అర్హత కలిగిన డిగ్రీలు పొందిన వారికి వర్తించే హై పొటెన్షియల్ ఇండివిద్యువల్ వీసా పరిధిని కూడా బ్రిటన్ విస్తరించింది. ఈ పథకం కింద వీసాల సంఖ్యను కూడా పెంచనుంది. అయితే రెండేళ్ల గ్రాడ్యుయేట్ వీసాకు సంబంధించి 'హై కాంప్లయన్స్ యూనివర్సిటీ', 'మెరుగైన ఉద్యోగ ఫలితాలు' వంటి అర్హతలను ఎలా నిర్ణయిస్తారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ నిబంధనలు పారదర్శకంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ట్రంప్‌కు అగ్నిపరీక్ష.. అమెరికాలో మొదలైన మధ్యంతర ఎన్నికల పోలింగ్

మొదటి పేజీ తరువాయి)

వినియోగించుకోనున్నారు. రికార్డు స్థాయిలో ఇప్పటికే 5.9 కోట్ల మంది ముందస్తు ఓటింగ్ లేదా మెయిల్-ఇన్ బ్యాలెట్ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఈ ఎన్నికలపై ప్రజల్లో ఉన్న ఆసక్తిని తెలియజేస్తోంది. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో, ఆయన పాలనకు ఈ ఎన్నికలను ఒక రెఫరెండంగా పరిగణిస్తున్నారు. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న జీవన వ్యయం, సరిహద్దు భద్రత, అక్రమ వలసలు, వాణిజ్య సుంకాల వంటి అంశాలు ఓటర్లను ప్రధానంగా ప్రభావితం చేస్తున్నాయి. అత్యధిక సర్వేల ప్రకారం ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనాలు వెలువడుతున్నాయి.ప్రస్తుతం కాంగ్రెస్‌లోని రెండు సభల్లో (ప్రతినిధుల సభ, సెనెట్) రిపబ్లికన్లకు స్వల్ప మెజార్టీ ఉంది. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు కనీసం ఒక్క సభలోనైనా ఆధిపత్యం సాధిస్తే, అధ్యక్షుడు ట్రంప్ విధానపరమైన నిర్ణయాలకు, చట్టాల ఆమోదానికి అడ్డంకులు సృష్టించే అవకాశం లభిస్తుంది. అయితే, డెమోక్రాట్లు గెలిస్తే, వారు ప్రతిపాదించే ప్రతి బిల్లును తన వీటో అధికారంతో అడ్డుకుంటానని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. టెక్సాస్, మిచిగాన్, ఐయోవా వంటి కీలక రాష్ట్రాల్లో సెనెట్ స్థానాలకు తీవ్రమైన పోటీ నెలకొంది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. భారత కాలమానం ప్రకారం బుధవారం (నవంబరు 4) తెల్లవారుజాము 5.30 గంటల నుంచి ప్రాథమిక ఫలితాలు వెలువడనున్నాయి. అయితే, భారీ సంఖ్యలో ఉన్న మెయిల్-ఇన్ బ్యాలెట్ల లెక్కింపు కారణంగా తుది ఫలితాలపై పూర్తి స్పష్టత రావడానికి కొన్ని రోజుల సమయం పట్టవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆర్టీజీఎస్, టెక్నాలజీతో తుపానుల గండం గట్టెక్కాం: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి)

ఆయన వివరించారు.తుపాను సహాయక చర్యల్లో భాగంగా రెస్క్యూ, రిలీఫ్, పునరావాసం అనే మూడు కీలక అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామని ఆయన తెలిపారు. "ఈ రెండు తుపానుల గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, గాలుల వేగాన్ని విశ్లేషించుకుంటూ ఆర్టీజీఎస్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులకు పక్కా సమాచారం అందించగలిగాం. 'అవేర్' (ూఔూ=ఙు) వేదిక ద్వారా విశ్లేషించుకుని, డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకున్నాం. గాలుల వేగం, వర్షపాతం, వరద నిర్వహణ వంటి అంశాలను 90 శాతం కచ్చితత్వంతో అంచనా వేశాం. ఈ అంచనాలను క్షేత్రస్థాయి వాస్తవాలతో పోల్చి చూసినప్పుడు మా విశ్లేషణ నిజమని తేలింది" అని చంద్రబాబు పేర్కొన్నారు.ఈ ముందస్తు అంచనాల వల్లే ముంపు గ్రామాలను ముందుగానే గుర్తించి, ప్రభావిత ప్రాంతాల్లో సహాయక సిబ్బందిని, అవసరమైన పరికరాలను మోహరించగలిగామని ఆయన చెప్పారు. అధికార యంత్రాంగాన్ని ఉన్నతస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కదిలించి, పూర్తి సమన్వయంతో పనిచేయడం వల్లే వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు తీసుకురాగలిగామని అన్నారు.విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని, రాష్ట్రవ్యాప్తంగా 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, 4095 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని సీఎం తెలిపారు. 548 సబ్ స్టేషన్ల నుంచి సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. "సాధారణంగా ఇంతటి నష్టాన్ని పూడ్చడానికి కనీసం 20 రోజులు పడుతుంది. కానీ పక్కా ప్రణాళికతో కేవలం 4 నుంచి 5 రోజుల్లోనే విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టగలిగాం" అని చంద్రబాబు వివరించారు.విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ క్షేత్రస్థాయిలోనే ఉండి పనిచేశారని సీఎం ప్రశంసించారు. కుండపోత వర్షంలోనూ విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారని, కూలిన చెట్లను తొలగిస్తూనే స్తంభాలు వేశారని గుర్తుచేశారు. ఆక్వా చెరువుల్లో పడిపోయిన స్తంభాలను సైతం తిరిగి నిలబెట్టారని, ఈ ప్రక్రియ కోసం పెద్ద ఎత్తున డ్రిల్లింగ్ మిషన్లను వినియోగించామని వివరించారు. ఈ సహాయక చర్యల్లో విద్యుత్ సిబ్బంది ప్రాణాలకు తెగించి పనిచేశారని చంద్రబాబు అభినందించారు. మొత్తం మీద, ముందస్తు అంచనాలు, టెక్నాలజీ వినియోగం, అధికార యంత్రాంగం సమన్వయం, సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్లే తుపానుల ప్రభావాన్ని వీలైనంత త్వరగా అధిగమించి, సాధారణ పరిస్థితులు నెలకొల్పగలిగామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

మహిళల భద్రతకు షీ టీమ్స్ అండ.. వేధింపులపై మౌనం వీడి ఫిర్యాదు చేయండి





- **అక్టోబర్‌లో 38 మంది వేధింపుదారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత.. 57 అవగాహన కార్యక్రమాలు**

నల్లగొండ, నవంబర్ 3 (విజయ కెరటం):

మహిళలు, బాలికలు, విద్యార్థినుల భద్రతకు నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈవ్ టీజింగ్, లైంగిక వేధింపులు, అసభ్య ప్రవర్తనను అరికట్టేందుకు షీ టీమ్స్ సమర్థవంతంగా పనిచేస్తూ బాధిత మహిళలకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలు వేధింపులపై మౌనం వీడి నిర్భయంగా ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు.నల్లగొండ, మిర్యాలగూడ కేంద్రాలుగా రెండు షీ టీమ్స్ బృందాలు పనిచేస్తున్నాయని, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, కళాశాలలు, మార్కెట్లు, షాపింగ్ మాల్స్ వంటి రద్దీ ప్రాంతాల్లో నిరంతరం నిఘా కొనసాగిస్తున్నాయని తెలిపారు. వేధింపులకు పాల్పడే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.మహిళలు ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్లకు నేరుగా రావాల్సిన అవసరం లేదని, డయల్ 112, క్యూఆర్ కోడ్, వాట్సాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా మైనర్ బాలికలు, మహిళలపై వేధింపులు జరిగినప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.సోషల్ మీడియా వినియోగంలో యువతులు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించవద్దని సూచించారు. వ్యక్తిగత ఫొటోలు, వివరాలను షేర్ చేయడంలో జాగ్రత్త వహించాలని, ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసే ఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బయటకు వెళ్లే సమయంలో తెలంగాణ పోలీస్ శాఖ అందుబాటులోకి తెచ్చిన టీ-సేఫ్ (T-Safe) యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

అక్టోబర్ నెలలో షీ టీమ్స్ పనితీరు:

అక్టోబర్ నెలలో షీ టీమ్స్‌కు 14 ఫిర్యాదులు అందగా, 3 పెట్టీ కేసులు నమోదు చేశారు. మహిళల భద్రతపై 57 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, 49 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వేధింపులకు పాల్పడుతున్న 38 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హాట్‌స్పాట్ ప్రాంతాల్లో 492 సార్లు పర్యటించి నిఘా కొనసాగించారు.

ఫిర్యాదుల కోసం సంప్రదించాల్సిన నంబర్లు:

జిల్లా షీ టీమ్: 8712670235

ఇన్‌చార్జి కె. మంజుల, ఇన్‌స్పెక్టర్: 8712670143

నల్లగొండ షీ టీమ్ ఇన్‌చార్జి గౌస్, ఎస్ఐ: 8712576870

మిర్యాలగూడ షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్. వెంకటేశ్వర్లు, ఎస్ఐ: 8712582094

మహిళల భద్రతకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. మహిళలు ఎలాంటి భయం, సంకోచం లేకుండా ఫిర్యాదు చేయాలని, వారి రక్షణకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఐటీ టవర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు పెంచాలి





విద్యార్థులకు విస్తృతంగా నైపుణ్య శిక్షణ అందించాలి -- కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, నవంబర్ 3 (విజయ కెరటం):

విద్యార్థుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఐటీ టవర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను మరింత విస్తరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. నైపుణ్యం కలిగిన యువత దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు.మంగళవారం నల్గొండ పట్టణంలోని ఐటీ టవర్‌ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, కంపెనీల పనితీరును పరిశీలించారు. తొలుత పీఎం విశ్వకర్మ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి శిక్షణ పొందుతున్న విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సుమారు 500 మందికి శిక్షణ అందించినట్లు నిర్వాహకులు వివరించారు.మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, నాగార్జున కళాశాల సహా ఇతర డిగ్రీ కళాశాలల విద్యార్థులకు పెద్ద సంఖ్యలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు పొందేలా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం ఐటీ టవర్‌లోని కంపెనీల నిర్వహణ, ఇతర వివరాలను మేనేజర్ ఎన్. ప్రకాశ్‌ను అడిగి తెలుసుకున్నారు. నిర్వహణ ఖర్చులు చెల్లించని సంస్థల నుంచి తప్పనిసరిగా మెయింటెనెన్స్ ఛార్జీలు వసూలు చేయాలని స్పష్టం చేశారు. విజువల్ ఎఫెక్ట్స్, వీడియో ఎడిటింగ్ తరగతులను పరిశీలించి ఏఐ టూల్స్ వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించాలని సూచించారు. ఈ పర్యటనలో ఐటీ టవర్ డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎన్. ప్రకాశం, ఇతర కంపెనీల అధికారులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో పట్టభద్రుల ఓటరు నమోదు పూర్తి చేయాలి





కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (BLR)

మిర్యాలగూడ, నవంబర్ 3 (విజయ కెరటం):

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను రాబోయే మూడు రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (BLR) పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని సర్పంచులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి వీడియో కాల్ ద్వారా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా గ్రామాలు, పట్టణాల్లో విస్తృత అవగాహన కల్పించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామ్రెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కోరారు.ఈ నెల 6వ తేదీన రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మిర్యాలగూడ నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు వెల్లడించారు.రాబోయే రెండేళ్లలో మిర్యాలగూడ నియోజకవర్గ రూపురేఖలు మార్చేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌తో నగరాభివృద్ధికి ఊతం!

- **ప్రాజెక్టుల డీపీఆర్‌లపై కేంద్ర అధికారులతో సమీక్ష**

వరంగల్, నవంబర్ 03, విజయ్ కెరటం:



వరంగల్ నగర అభివృద్ధికి ప్రతిపాదించిన కీలక ప్రాజెక్టులను అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా ముందుకు తీసుకెళ్లేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు.నగర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు కీలక పనులకు సంబంధించిన ప్రాజెక్టు నివేదికలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ, మిషన్ డైరెక్టర్ ఇషా కలియా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో పాటు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ టి. వెంకన్న పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ వెంకన్న నగరంలో ప్రతిపాదించిన స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణం, ఖిలా వరంగల్ మోటు అభివృద్ధి, వరంగల్ బస్ స్టేషన్ అభివృద్ధి, హనుమకొండ చౌరస్తా ఆధునికీకరణ, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ తదితర ప్రాజెక్టుల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ ప్రాజెక్టుల అమలుకు అవసరమైన ప్రతిపాదనలు, సాంకేతిక అంశాలు, డీపీఆర్‌లను కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించాలని అధికారులకు సూచించారు. నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టులు అమలులోకి వస్తే నగరంలో వర్షపు నీటి నిర్వహణ మెరుగుపడటంతో పాటు ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, పార్కింగ్ సౌకర్యాల విస్తరణకు దోహదపడనున్నాయి. నగర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ ప్రతిపాదనలు కీలకంగా నిలవనున్నాయి.

పత్తి ధరల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి!

- **రైతుల చెమటకు తగిన ధర ఏదీ? అధికారుల తీరుపై రైతు రక్షణ సమితి ఆగ్రహం!**

వరంగల్, నవంబర్ 03, విజయ్ కెరటం:



రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ మార్కెట్ అధికారులదేనని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు అన్నారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఇతర మార్కెట్లతో పోలిస్తే పత్తికి తక్కువ ధరలు లభించడంపై విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.మంగళవారం తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి పత్తి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కిషన్‌రావు మాట్లాడుతూ ఇతర వ్యవసాయ మార్కెట్లతో పోలిస్తే ఏనుమాముల మార్కెట్‌లో పత్తికి తక్కువ ధరలు లభిస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ధరలు తగ్గడానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలని, మార్కెట్‌లో పారదర్శకమైన బహిరంగ వేలం నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.వ్యాపారుల మధ్య కుమ్మక్కు లేదా ధరల నియంత్రణ జరుగుతోందా అనే అంశాన్ని పరిశీలించాలని, పత్తి నాణ్యత, తేమశాతం పేరుతో రైతులకు అన్యాయం జరగకుండా నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవక పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయని, ఎకరాకు రావాల్సిన దిగుబడిలో భారీగా కోత పడటంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో పత్తికి సరైన ధర లభించకపోవడం రైతులను మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుందని అన్నారు.ఆసియాలోనే రెండో అతిపెద్ద మార్కెట్‌గా పేరొందిన ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందించే కేంద్రంగా నిలవాలని కిషన్‌రావు కోరారు.ఈ కార్యక్రమంలో రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు చౌళ్ల రామారావు, జిల్లా కార్యదర్శి సురాబు బాబురావు, నాయకులు నాగుర్ల రాజీరు, భాషబోయిన కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండలో తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ భేష్

- **అధికారులను అభినందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అనిమేష్ భట్టాచార్య**

నల్లగొండ, నవంబర్ 3 (విజయ కెరటం):



నల్లగొండ జిల్లాలో రక్షిత మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, పరిశుభ్రత నిర్వహణ బాగుందని జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అనిమేష్ భట్టాచార్య ప్రశంసించారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో ప్రజలకు అందిస్తున్న తాగునీటి సరఫరా, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మారుమూల గిరిజన ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యాలు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఫ్లోరైడ్ సమస్యను ఎదుర్కొన్న ప్రాంతాల్లో ప్రస్తుతం చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు అందిస్తున్న తాగునీటి సరఫరా వివరాలను ఆ శాఖ ఎస్ఈ నాగేశ్వరరావు వివరించారు.అనంతరం డాక్టర్ అనిమేష్ భట్టాచార్య మాట్లాడుతూ.. జిల్లాలో తాగునీరు, పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులను అభినందించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలు, మారుమూల గిరిజన ప్రాంతాలకు నిరంతరం రక్షిత మంచినీరు అందించాలని ఆదేశించారు. పాఠశాలల్లో తాగునీటి ట్యాంకులను తరచూ శుభ్రం చేస్తూ విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్ఓ ప్లాంట్ల నిర్వహణ వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు.అంతకుముందు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, ఇతర అధికారులు పూల మొక్కలు అందజేసి ఆయనకు స్వాగతం పలికారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, జిల్లా సంక్షేమ అధికారి లావణ్య తదితరులు పాల్గొని తమ శాఖల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయం

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన.. ఎస్.కె.ఎస్.ఎస్ ప్రతినిధులను అభినందించిన డీఎస్పీ శివరాం రెడ్డి

నల్లగొండ, నవంబర్ 3 (విజయ కెరటం):



నిరుద్యోగ యువతకు స్వచ్ఛంద సంస్థలు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు రావడం మంచి పరిణామమని నల్లగొండ డీఎస్పీ కొలను శివరాం రెడ్డి అన్నారు. నిరుద్యోగులు అధైర్యపడకుండా, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనలకు లోనుకాకుండా అందివచ్చిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ కేంద్రం సెమినార్ హాల్‌లో ఎస్.కె.ఎస్.ఎస్ (SKSS) ఆధ్వర్యంలో పొట్టిపాక నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన మెగా జాబ్ మేళాకు డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తూ తమ కలలను సాకారం చేసుకోవాలని, నిర్దేశించుకున్న లక్ష్యాలను విజయవంతంగా చేరుకోవాలని యువతకు పిలుపునిచ్చారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వందలాది మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలనే సదుద్దేశంతో ఎస్.కె.ఎస్.ఎస్ సంస్థ మెగా జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఫాక్స్‌కాన్, ఓరియంట్ ఎలక్ట్రిక్, ప్రీమియర్ ఎనర్జీస్ వంటి అంతర్జాతీయ స్థాయి కంపెనీలు పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాబ్ మేళా నిర్వహించిన ఎస్.కె.ఎస్.ఎస్ ప్రతినిధులను డీఎస్పీ అభినందించారు.ఈ కార్యక్రమంలో నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. ఉపేందర్, టూ టౌన్ ఎస్ఐ సైదాబాబు, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ బొజ్జ అనిల్ కుమార్, ఫాక్స్‌కాన్ హెచ్ఆర్ మేనేజర్ శ్రీనివాస్, ఎస్.కె.ఎస్.ఎస్ మేనేజర్ మూర్తి, సంస్థ ప్రతినిధులు తరాల నరేష్, తోగిటి అనుదీప్, నల్ల మధు, కట్ట హరిబాబు, నాంపల్లి మధు, తోనుకునూరి సన్నీ, కొవూరు అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి ధరల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి!

రైతుల చెమటకు తగిన ధర ఏదీ? అధికారుల తీరుపై రైతు రక్షణ సమితి ఆగ్రహం!

వరంగల్, నవంబర్ 03, విజయ్ కెరటం:



రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ మార్కెట్ అధికారులదేనని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు అన్నారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఇతర మార్కెట్లతో పోలిస్తే పత్తికి తక్కువ ధరలు లభించడంపై విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.మంగళవారం తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి పత్తి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కిషన్‌రావు మాట్లాడుతూ ఇతర వ్యవసాయ మార్కెట్లతో పోలిస్తే ఏనుమాముల మార్కెట్‌లో పత్తికి తక్కువ ధరలు లభిస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ధరలు తగ్గడానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలని, మార్కెట్‌లో పారదర్శకమైన బహిరంగ వేలం నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.వ్యాపారుల మధ్య కుమ్మక్కు లేదా ధరల నియంత్రణ జరుగుతోందా అనే అంశాన్ని పరిశీలించాలని, పత్తి నాణ్యత, తేమశాతం పేరుతో రైతులకు అన్యాయం జరగకుండా నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవక పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయని, ఎకరాకు రావాల్సిన దిగుబడిలో భారీగా కోత పడటంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో పత్తికి సరైన ధర లభించకపోవడం రైతులను మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుందని అన్నారు.ఆసియాలోనే రెండో అతిపెద్ద మార్కెట్‌గా పేరొందిన ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందించే కేంద్రంగా నిలవాలని కిషన్‌రావు కోరారు.ఈ కార్యక్రమంలో రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు చౌళ్ల రామారావు, జిల్లా కార్యదర్శి సురాబు బాబురావు, నాయకులు నాగుర్ల రాజీరు, భాషోయిన కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్డు పోషకాల గని.. చిరు వ్యాపారులకు అండగా నిలవాలి!

ఎగ్ కార్డుల పంపిణీలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

వరంగల్,నవంబర్ 03, విజయ కెరటం:

కోడిగుడ్డు కేవలం ఆహారం మాత్రమే కాదని, ఆరోగ్యానికి అవసరమైన పోషకాలను అందించే సంపూర్ణ పౌష్టికాహారమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. తక్కువ ధరలో లభించే కోడిగుడ్డులో నాణ్యమైన మాంసకృత్తులు, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయని, పిల్లల ఎదుగుదలకు, కండరాల బలోపేతానికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.పౌష్టికాహారంపై అవగాహన పెంచడంతో పాటు చిరు వ్యాపారులకు ఉపాధి కల్పించే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు.మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఆయన సోదరుడు, జాతీయ గుడ్ల సమన్వయ కమిటీ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆధ్వర్యంలో మంగళవారం పర్వతగిరిలోని వారి నివాసంలో 30 మంది చిరు వ్యాపారులకు ఎగ్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ రవిచంద్ర లబ్ధిదారులకు ఎగ్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ, చిరు వ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేయడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చిన్న వ్యాపారాలను తక్కువగా చూడకుండా, వాటి ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్న వారికి చేయూతనివ్వాలని సూచించారు. ప్రజలకు పౌష్టికాహారం అందుబాటులోకి తీసుకురావడంతో పాటు చిరు వ్యాపారుల జీవనోపాధికి తోడ్పడేలా ఎగ్ కార్డుల పంపిణీ చేపట్టడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వ్యాపారులకు వ్యాపార నిర్వహణకు అవసరమైన స్టాళ్లు, గ్యాస్ సిలిండర్లు, మూకుళ్లు, గరిటెలను కూడా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రదీప్ రావు, వారి కుటుంబ సభ్యులను ఎంపీ రవిచంద్ర అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



సివిల్ ఇంజినీరింగ్‌లో సరికొత్త ఆవిష్కరణలకు వేదికగా 'ఆర్ఐడీఈఎస్-2026'





- **నవంబర్ 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు, బిల్డ్-టెక్ ఎక్స్‌పో**

హైదరాబాద్, నవంబర్ 3 విజయ కెరటం

సివిల్ ఇంజినీరింగ్ రంగంలో సుస్థిర అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న ఆవిష్కరణలు, విపత్తులను తట్టుకునే నిర్మాణాల రూపకల్పనపై చర్చించేందుకు 'ఆర్ఐడీఈఎస్-2026' అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజినీర్స్ (ఇండియా) హైదరాబాద్ సెంటర్ ఆధ్వర్యంలో నవంబర్ 26, 27 తేదీల్లో గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ)లో రెండు రోజుల పాటు ఈ సదస్సుతో పాటు బిల్డ్-టెక్ ఎక్స్‌పో-2026 జరగనుంది.ఈ కార్యక్రమానికి దేశ, విదేశాలకు చెందిన 1,000 మందికి పైగా సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు, స్ట్రక్చరల్ ఇంజినీర్లు, ఆర్కిటెక్టులు, కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు హాజరుకానున్నారు. నిర్మాణ రంగం, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఎదురవుతున్న సవాళ్లు, వాటికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలపై చర్చించనున్నారు.సదస్సులో నలంద విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సునైనా సింగ్ ముఖ్యోపన్యాసం చేయనున్నారు. చారిత్రక నలంద నిర్మాణాల పునరుద్ధరణ, పునరావాసం, పునర్నిర్మాణ అంశాలను వివరించనున్నారు. అలాగే ప్రొఫెసర్ డాక్టర్-ఇంగ్ మార్వాన్ అల్‌జయ్యాలే ఆధునిక డీప్ ఫౌండేషన్ ఇంజినీరింగ్‌పై ప్రసంగించనున్నారు.డాక్టర్ వి. రాజేంద్రన్, సీఎస్ఐఆర్-ఎస్ఈఆర్సీ చెన్నై డైరెక్టర్ డాక్టర్ ఎన్. ఆనందవల్లి, డాక్టర్ మొహమ్మద్ అబ్బాల్ తదితరులు నిర్మాణాల పునరుద్ధరణ, స్ట్రక్చరల్ హెల్త్ మానిటరింగ్, భారీ నిర్మాణాలపై తమ అనుభవాలను పంచుకోనున్నారు. డిజిటల్ ఇంజినీరింగ్, బీఐఎం ఆధారిత డిజైన్, 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ వంటి అంశాలపై కూడా నిపుణులు ప్రసంగించనున్నారు. హై-రైజ్ భవనాల్లో ప్లంబింగ్ వ్యవస్థలు, గ్రీన్ రూఫ్స్, వర్టికల్ ట్రాన్స్‌పోర్టేషన్, కాంపోజిట్ స్ట్రక్చర్స్ వంటి ఆధునిక అంశాలు చర్చకు రానున్నాయి.వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, పాతబడుతున్న మౌలిక సదుపాయాల నేపథ్యంలో భవిష్యత్తు నిర్మాణ రంగానికి అవసరమైన సురక్షితమైన, సుస్థిరమైన, వినూత్న ఇంజినీరింగ్ పరిష్కారాలను ప్రోత్సహించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞాన మార్పిడికి ఈ సదస్సు దోహదపడనుంది.సదస్సుతో పాటు నిర్వహించే బిల్డ్-టెక్ ఎక్స్‌పోలో ఆధునిక నిర్మాణ సామగ్రి, అత్యాధునిక యంత్రాలు, ఇంజినీరింగ్ సాఫ్ట్‌వేర్, పర్యావరణహిత నిర్మాణ పరిష్కారాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించనున్నారు. ఉత్పత్తుల ప్రత్యక్ష ప్రదర్శనలు, వ్యాపార అవకాశాలు, నెట్‌వర్కింగ్‌కు ఈ ఎక్స్‌పో వేదిక కానుంది. సాధారణ ప్రజలు సైతం ఈ ప్రదర్శనను సందర్శించవచ్చని నిర్వాహకులు వెల్లడించారు.ఏసీసీఈ (ఐ) హైదరాబాద్ సెంటర్ చైర్మన్ ఎర్. భీమ్ రావు జలిగామా నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆర్గనైజింగ్ చైర్మన్‌గా ఎర్. రాజ్‌కుమార్ కాచర్ల, సెక్రటరీ జనరల్‌గా ఎర్. అడేపు కాశీరామ్, కో-చైర్మన్‌గా ఎర్. సద్ది మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎర్. సి. రమేష్, గౌరవ కార్యదర్శిగా ఎర్. డి.ఎస్. జయప్రకాశ్, ట్రెజరర్‌గా ఎర్. రుద్ర అమర్నాథ్ బాబు, మీడియా కన్వీనర్‌గా ఎర్. అక్కల సుధాకర్ వ్యవహరిస్తున్నారు.

వేదిక: ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ), గచ్చిబౌలి, హైదరాబాద్.

తేదీలు: నవంబర్ 26, 27, 2026.

నిర్వాహకులు: అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజినీర్స్ (ఇండియా), హైదరాబాద్ సెంటర్.

నల్లగొండలో నీటి నాణ్యత పరీక్షలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సంతృప్తి

పానగల్‌లో నీటి నాణ్యత ప్రయోగశాల, మిషన్ భగీరథ కేంద్రం పరిశీలన

నల్లగొండ, నవంబర్ 3 (విజయ కెరటం):



జిల్లాలో ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించేందుకు చేపడుతున్న నీటి శుద్ధి ప్రక్రియలు, నాణ్యత పరీక్షల నిర్వహణ పట్ల జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అనిమేష్ భట్టాచార్య సంతృప్తి వ్యక్తం చేశారు.మంగళవారం ఆయన పానగల్ సమీపంలోని జిల్లా నీటి నాణ్యత ప్రయోగశాల (ఎన్ఏబీఎల్ ల్యాబ్), మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ప్రయోగశాలలో నిర్వహిస్తున్న రసాయనిక, మైక్రోబయోలాజికల్ పరీక్షల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు సంబంధించిన రిజిస్టర్లతో పాటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సేకరించిన నీటి నమూనాల నివేదికలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ, నాణ్యత ప్రమాణాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం పానగల్‌లోని ఉదయసముద్రం వద్ద ఉన్న మిషన్ భగీరథ ఇంటేక్ వెల్, 35 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. నీటి శుద్ధి విధానం, నాణ్యత పరీక్షలు, నిర్వహణ రిజిస్టర్లు, ప్రజలకు నీటి సరఫరా చేసే విధానంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో అమలు చేస్తున్న నీటి శుద్ధి, నాణ్యత పర్యవేక్షణ విధానాలను అభినందించారు. ఇదే తరహా విధానాలను ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ పర్యటనలో మిషన్ భగీరథ ఎస్ఈ నాగేశ్వరరావు, ఈఈ శాంతకుమారి, ఏఈఈ సంతోష్, ప్రయోగశాల ఇన్‌చార్జి పి. వీరారెడ్డి, మైక్రోబయాలజిస్ట్ బి. సుజాత, కెమిస్ట్ ఎస్. రేణుక, ప్రశాంతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 15న కార్మికులు భారీగా తరలివచ్చి బహిరంగ సభను జయప్రదం చేయాలి







కార్మిక--కర్షక ఐక్య పోరాటాలను కొనసాగిద్దాం: సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ సలీం

నల్లగొండ, నవంబర్ 3 (విజయ కెరటం):

నల్లగొండ పట్టణంలో నవంబర్ 15 నుంచి 18 వరకు నిర్వహించనున్న అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభల సందర్భంగా నవంబర్ 15న జరిగే బహిరంగ సభకు కార్మికులు పెద్ద ఎత్తున హాజరై కార్మిక--కర్షక ఐక్యతను చాటాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ సలీం పిలుపునిచ్చారు.మంగళవారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన సీఐటీయూ పట్టణ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించి రైతులను కూలీలుగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు ఐక్యంగా పోరాడాలని అన్నారు. జాతీయ మహాసభల సందర్భంగా జరిగే బహిరంగ సభకు కార్మిక వర్గం భారీగా తరలివచ్చి రైతాంగానికి మద్దతుగా నిలవాలని కోరారు.

పట్టణాన్ని ఎరుపుమయం చేసేలా స్వాగత ఏర్పాట్లు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య మాట్లాడుతూ.. నవంబర్ 15 నుంచి 18 వరకు జరిగే 36వ జాతీయ రైతు మహాసభలకు నల్లగొండలోని వివిధ రంగాల కార్మికులు ఘన స్వాగతం పలకాలని కోరారు. పట్టణమంతా ఎరుపుమయం అయ్యేలా అలంకరణలు, స్వాగత బ్యానర్లు ఏర్పాటు చేయాలని, ర్యాలీల్లో వేలాది మంది కార్మికులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని యూనియన్ల జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించి కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు.

నవంబర్ 14 నుంచి 16 వరకు అగ్రి షో

ఈ నెల 14 నుంచి 16 వరకు నల్లగొండలోని పెద్ద గడియారం సెంటర్‌లో పాత ఆర్అండ్‌బీ కార్యాలయ స్థలంలో అగ్రి షో నిర్వహించనున్నట్లు సత్తయ్య వెల్లడించారు. ఇందులో ఆధునిక వ్యవసాయ పరికరాలు, నూతన వంగడాలు, పంటలపై తెగుళ్ల ప్రభావం, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ వేలాది మంది రైతులు, యువ రైతులు, మహిళా రైతులు పాల్గొని అగ్రి షోను సందర్శించాలని కోరారు.ఈ సమావేశంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, గంజి రాజేష్, సుంకరబోయిన వెంకన్న, చింతకాయల సంతోష్‌తో పాటు వివిధ యూనియన్ల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528